بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 25.10.2019 (Telugu)**

**నమాజులను క్రమం తప్పకుండా సలిపినవాడే విశ్వాసి లేనిచో అతనిలో అవిశ్వాసునిలో ఎలాంటి తేడా లేదనే ఆదేశము మనల్ని కంపించునట్టిది. మనము మస్‌జిదులు నిర్మించినచో మస్‌జిదుల హక్కు చెల్లించుట కూడ అనివార్యము. స్వయముగా పుణ్యములు చేయుచు, ఇతరులకు పుణ్యముల గురించి సూచించుట ముఖ్యమే.**

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 25.10.2019 తేదీన - మస్‌జిద్ మహ్దీ, స్ట్రాస్ బర్గ్, ఫ్రాన్స్ లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఈ క్రింది సూక్తిని పఠించిరి.

اَلَّذِيۡنَ اِنۡ مَّكَّنّٰهُمۡ فِى الۡاَرۡضِ اَقَامُوا الصَّلٰوةَ وَاٰتَوُا الزَّكٰوةَ وَاَمَرُوۡا بِالۡمَعۡرُوۡفِ وَنَهَوۡا عَنِ الۡمُنۡكَرِ‌ؕ وَلِلّٰهِ عَاقِبَةُ الۡاُمُوۡرِ

(అల్‌హజ్ అధ్యాయపు 42)

అనంతరం హుజూరె అన్వర్ ఈ సూక్తి అనువాదమిట్లు వినిపించిరి. అనగా వారికి భూమిపై మేము వైభవము ప్రసాదించినచో వారు ప్రార్థన (నమాజ్) స్థిరపరచుదురు. దానము(జకాత్) చేయుదురు. సత్కర్మలను ఆదేశింతురు. దుష్కర్మలతో ఆపుదురు. ప్రతి విషయపు అంతము అల్లాహ్ అధీనములోనే యున్నది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. శక్తి లభించినచో నమాజులను స్థిరపరుస్తారు, తమ మస్‌జిదులను జనావాసాలుగా మారుస్తారు, ప్రజా సేవలో పాల్గొంటారు, అల్లాహ్ తఆలా భీతితో నిరుపేదలు, లేనివారి కొరకు తమ ధనమును వినియోగిస్తారు, ధర్మ ప్రచారము కొరకు త్యాగములు సమర్పిస్తారు, సత్కర్మల వైపు తాము స్వయముగా శ్రద్ధ చూపిస్తు, ఇతరులకు కూడ సూచిస్తారు, దుష్కర్మల నుండి తాము స్వయముగా దూరముంటారు, ఇతరులను కూడ నివారిస్తారు. కావున వీరే నిజమైన విశ్వాసులని అల్లాహ్ తఆలా ఈ సూక్తిలో విశ్వాసులకు సూచించెను. అందుకే అల్లాహ్ తఆలా కూడ ఈ పనులకు మహత్తర ఫలితములను పుట్టించును. ఎందుకనగా ప్రతి దానిని అల్లాహ్ తఆలా నిర్ణయించును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మీరిక్కడ మహ్దీ ఆబాద్‌లో మస్‌జిద్ నిర్మించారు. ఇది ప్రారంభించడినది. వంద మస్‌జిదుల పథకములో భాగంగా జర్మనీ జమాఅత్ మస్‌జిదుల నిర్మాణ అనుగ్రహము పొందుచున్నది. మస్‌జిదులు నిర్మించడంతో తమ ఉద్దేశము పూర్తి కాదని, వారు వినయముతో అల్లాహ్ తఆలా ఆరాధన వైపు శ్రద్ధ చూపినప్పుడు, తమ నమాజులను సలిపినప్పుడు, బాజమాఅత్ నమాజుల కొరకు మస్‌జిద్‌నకు వచ్చినప్పుడు అసలు ఉద్దేశము పూర్తి అగునని ప్రతి అహ్మదీ గుర్తుంచుకోవలెను. నిష్ఠాపరుని లక్షణములు వివరిస్తు హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించారు.

వారు నమాజులు సలుపుతారు అనగా నమాజ్‌ను నిలుపుతారు. నిష్ఠాపరుడు అల్లాహ్ తఆలాతో భయపడును. అతడు నమాజ్ సలుపును. ఈ స్థితిలో వివిధ రకాల అపోహలు, ప్రమాదములు కూడ పుట్టి అతని మార్గములో ఆటంకముగా మారును. మనసు ఈ విధంగా క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయములో కూడ ఒక నిష్ఠాపరుడు కష్టపడి ప్రయత్నించి దానిని నిలుపును. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఒక వ్యక్తి స్థిరంగా నమాజ్ సలిపినచో, తన నమాజ్‌ను ఉన్నత స్థాయికి చేర్చుటకు ప్రయత్నించినచో తుదకు అల్లాహ్ తఆలా తన వాక్యముతో మార్గదర్శనము అందించు సమయము కూడ వచ్చును.

హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. బాహ్య ఆహారము లేనిదే బ్రతకడం కష్టమైనట్లే నమాజ్ లేనిదే జీవించడం కూడ కష్టమే. ఈ ఆహారములో ఆనందము కూడ కలుగును. తీవ్రంగా దాహం వేసినప్పుడు చల్లటి నీరు త్రాగడంతో ఎంత ఆనందము, అభిరుచి కలుగునో నమాజ్‌లో కూడ అటువంటి ఆనందము, అభిరుచి

కలుగును. ఎందుకనగా అతడు అతి శ్రద్ధతో దానిని త్రాగును, పుష్టిగా త్రాగి ఆనందము పొందును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. విశ్వాసుడైన నిష్ఠాపరుడు నమాజ్‌లో ఆనందము పొందును. కనుక నమాజ్‌ను మంచిగా, శ్రద్ధతో సలుపుము. అన్ని అభివృద్ధులకు పునాది, మెట్లు నమాజే. అందుకే నమాజ్ విశ్వాసుని శిఖర స్థాయి అని తెలుపబడెను. దీని ద్వారనే అల్లాహ్ తఆలా వరకు చేరుకోవచ్చును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మనము మస్జిదులను నిర్మించినచో నమాజులు సలుపు వారు కూడ కావలెను. మనము మస్జిదులు నిర్మంచుట వైపు శ్రద్ధ చూపినచో అల్లాహ్ తఆలా వరకు చేర్చు, అల్లాహ్ తఆలాతో మాట్లాడు అవకాశము కలిగించు ఆ శిఖర స్థాయిని పొందుటకు శ్రద్ధ చూపవలెను. ఈ స్థాయి ఎలా లభిస్తుందని నిరాశ చెందకూడదు. వరుస కృషితో అల్లాహ్ తఆలా ఈ స్థాయిని అందించును. నమాజ్‌లో శ్రద్ధ స్థిరంగా వుండదని చాలా మంది అడుగుతారు, నాకు కూడ వ్రాస్తారు. ప్రయత్నిస్తు పదే పదే శ్రద్ధను నిలుపుటకు కృషి చేయుటయే దీని చికిత్స. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. ఇటువంటి అపోహలకు మానవుడు లోనుకాక పోవడం కూడ అల్లాహ్ తఆలా శుభము, ఉపకారమే. మానవుడు ఇటువంటి అపోహలకు తలొగ్గక పోవడం కూడ పుణ్య స్థితియే. అల్లాహ్ తఆలా ఇందుకు కూడ పుణ్యము అందించును. ఇట్లనిరి. పాపము ఏంటిదో దుష్టునికి తెలియనే తెలియదు. నిందించు మనసు పాపమునకు పాల్పడినప్పుడు పాపము గురించి సదా భయపడును, పశ్చత్తాపమునకు గురి అగును. ఇది నిందించు ఆత్మ పరిస్థితి. పాపముపై పశ్చత్తాపము పడినచో ఇందుకు కూడ అల్లాహ్ తఆలా పుణ్యము అందించును. ఇటువంటి వ్యక్తి బానిస కాదు. మానవుడు అలసటకు గురి కాకూడదు. సజ్దాహ్‌లో يَاحَيُّ يَاقَيُّومُ بِرَحْمَتِكَ أَسْتَغِيثُ۔ (యాహయ్యు యా ఖయ్యూము బిరహ్మతిక అస్తఘీస్) బాగా చదవండి. కాని తొందరపాటు సరికాదని గుర్తుంచుకోగలరు. సంవత్సరముల తరబడి శ్రమించి, చమటోడ్చిన తర్వాత షైతాన్ దాడులు బలహీనమైపోవును. షైతాన్ పారిపోవును. కాని తొందరపాటుకు గురై, నమాజ్ సలుపుటకు పూర్తి కృషి చేయనిచో మానవుడు షైతాన్ దాడులకు గురగును. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రపంచమును మాత్రమే మానవుడు యాచించినచో ఇటువంటి దుఆలను మాత్రమే అల్లాహ్ తఆలా ఆమోదించదు. అల్లాహ్ తఆలాతో తన ఆధ్యాత్మిక, ధార్మిక ప్రగతిని యాచించినచో, అల్లాహ్ తఆలా సామీప్యమును అడిగినచో అల్లాహ్ తఆలా సామీప్యము కూడ లభించును, ఇటువంటి వ్యక్తి ప్రాపంచిక అవసరములు కూడ పూర్తి అగును. ఈ అంశమును వివరిస్తు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

"నమాజ్‌లో తమ భాషలో కూడ దుఆలు చేయండి. దుఃఖము, అతి శ్రద్ధతో చదివినదే నమాజ్. దుఃఖము కలిగినవారే పాపముల నుండి దూరముంటారు., ఇట్లనిరి. ان الحسنات یذھبن السیئات۔ అనగా పుణ్యములు పాపములను దూరము చేయును. ఇక్కడ హసనాత్ అనగా నమాజులు. తమ భాషలో దుఆలు చేసినప్పుడే దుఃఖము, శ్రద్ధ ఏర్పడును. ఇంకా వారిట్లనిరి. ఎందుకనగా ఉత్తమమైన దుఆ ఫాతిహా. ఎందుకనగా ఇది విశాల భావము కలిగిన చిన్న దుఆ. ఫాతిహా అధ్యాయములో అల్లాహ్ తఆలా మనకు ఒక దుఆ నేర్పించెను. اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔ మీరు అల్లాహ్‌ను కలిసేందుకు సత్పథమును అన్వేషించండి. ఓ నా అల్లాహ్! నేను పాపిని, నీ దాసుడను, మార్గభ్రష్టున్ని నాకు మార్గదర్శనము చూపుము. అవసరాలు చిన్నవైనా పెద్దవైనా నిస్సంకోచంగా అల్లాహ్ తఆలాతో అడగండి. ఎందుకనగా ప్రసాదించువాడు అతడే. దుఆలు ఎక్కువ చేయువాడే ఎక్కువ పుణ్యుడు. ఎందుకనగా ఒక పిసినారి ఇంటి ముందు యాచకుడు ప్రతి రోజు యాచించినచో ఏదో ఒక రోజు అతనికి సిగ్గు కలుగును. ఇలాంటప్పుడు అల్లాహ్ తఆలాను యాచించినవాడు ఎందుకు పొందడు. కావున యాచించువాడు ఏదో ఒక రోజు తప్పక పొందును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. బైఅత్ చేస్తున్నప్పుడు పశ్చత్తాపము, అంగీకరించుటలో ఒక శుభము కలుగును. దీనికి తోడు ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిచ్చు నిబంధనను పాటించినచో అభివృద్ధి లభించును. కాని ఇలా ప్రాధాన్యతనిచ్చుట మీ వశములో లేదు. కావున అల్లాహ్ తఆలా సహాయము చాలా అవసరముండును. అందుకే అల్లాహ్ తఆలా ఇట్లు తెలిపెను. وَالَّذِيْنَ جَاهَدُوْا فِيْنَا لَنَهْدِيَنَّهُمْ سُبُلَنَا మా మార్గములో ప్రయత్నించువారు తుదకు సన్మార్గము పొందుతారు. దైవ సహాయము లేనిదే మార్పు అసాధ్యము. అతని సహాయము కోరుటకు, అతని శుభమును యాచించుటకు దుఆ తప్పక చేయవలసి వుండును. అందుకే

ఐదు పూటల నమాజులలో ఫాతిహా అధ్యాయము చదవాలని అదేశము గలదు. ఇందులో 'ఇయ్యాక నాబుదు మరియు ఇయ్యాక నస్తయీన్' అనగా మేము నిన్నే ఆరాధిస్తాము, నీతోటే సహాయము కోరుతామని యున్నది. ఇందులో రెండు విషయములున్నవి. అనగా ప్రతి సత్కార్యములో ప్రణాళిక, ప్రయత్నముతో కృషి చేయండి. దుఆ మాత్రమే చేయుచు ప్రయత్నము చేయనివాడు సఫలము కాలేడు. ఉదా॥ వ్యవసాయదారుడు విత్తనము చల్లి కృషి చేయనిచో పంటను ఎలా ఆశించును. ఇదే విధంగా ధార్మిక పనులు కూడ వున్నవి. వీరిలో దాంబికులు, వీరిలోనే సోమరులు, వీరిలోనే సదాచారులు, వీరి లోనే గొప్ప సత్కార్యులు, మహా సజ్జనులు సిద్ధమౌతారు. కొందరు 40, 40 సంవత్సరములు నమాజులు చదువుతారు కాని ఆరంభ దశలోనే వుంటారు. ఎలాంటి ప్రగతి సాధించరు. రమజాన్‌లో 30 రోజులు ఉపవాసము కూడ వుంటారు. అయిను ఎలాంటి ప్రయోజనము కలుగదు. మేము పెద్ద నిష్ఠాపరులము, సుదీర్ఘ కాలము నుండి నమాజ్ చదువుతున్నాము కాని దైవ సహాయము లభించడం లేదని చాలా మంది అంటారు. ప్రగతి గురించి ఆలోచించకుండా ఆచారముగా ప్రార్థన చేయడమే ఇందుకు కారణం. పాపముల గురించి ఆలోచించనే ఆలోచించరు. నిజమైన పశ్చత్తాపమును ఆశించనే ఆశించరు. కావున వారు మొదటి అడుగులోనే వుంటారు. ఇటువంటి మానవులు వన జంతువుల కంటే తక్కువేమి కాదు. ఈ రకమైన ప్రార్థనలు అల్లాహ్ తఆలా శాపమునకు గురి చేయును. ఆమోదించబడక తిరిగి ముఖముపై కొట్టబడును. ప్రగతి అందించినదే నమాజ్. హుజూరె అన్వర్ ఇట్లనిరి. కావున ఆచారము నిమిత్తం నమాజ్ మంచిది కాదు. దీనిని మార్చుకోవలెను. నేను దుఆ ఆమోదిస్తానని అల్లాహ్ తఆలా తెలుపుచున్నాడు. నా దుఆలు ఎందుకు ఆమోదించబడడం లేదని గ్రహించవలెను. అల్లాహ్ తఆలా సామీప్యము లభించినప్పుడే ప్రార్థన అనబడును.

నమాజ్ వాస్తవమును తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నమాజ్ వాస్తవానికి దుఆయే. ఒక్కొక్క పదము దుఆ కొరకు పలుకవలెను. నమాజ్‌లో మనసుకు నిలకడ లేనిచో శిక్షకు సిద్ధము కావలెను. ఎందుకనగా దుఆ చేయని వ్యక్తి వినాశనానికి చేరువగును. మానవునికి విశ్రాంతి నిచ్చుటకు అల్లాహ్ తఆలా ఎల్లప్పుడు సిద్ధముగా నున్నాడు. కాని అతనిని వేడుకొనుటయే షరతు. అవిధేయత నుండి దూరముండుట దుఆల ఆమోద కొరకు తప్పనిసరి. దుఆ చాలా గట్టిగా చేయవలెను. ఎందుకనగా రాయిపై రాయి గట్టిగా పడినప్పుడే నిప్పు రాజుకొనును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మనము ఈ స్థితిని మనలో కల్పించుకొన్నప్పుడు, మన కర్మలు కూడ అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుకటు అయినప్పుడు అల్లాహ్ తఆలా కూడ మన భయములను సదా శాంతిలోకి మార్చును. అవిశ్వాసము మరియు విశ్వాసమును వేర్వేరు చేయునది నమాజ్ విడిచిపెట్టుట అను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశమును మనము ఎల్లప్పుడు గుర్తుంచుకోవలెను. నమాజులను క్రమం తప్పకుండా సలిపినవాడే విశ్వాసి లేనిచో అతనిలో అవిశ్వాసునిలో ఎలాంటి తేడా లేదనే ఆదేశము మనల్ని కంపించునట్టిది. మనము మస్జిదులు నిర్మించినచో మస్జిదుల హక్కు చెల్లించుట కూడ అనివార్యము. స్వయముగా పుణ్యములు చేయుచు, ఇతరులకు పుణ్యముల గురించి సూచించుట ముఖ్యమే. తాము స్వయముగా ఇక్కడి పరిసరాల నుండి దూరముంటూ ఇతరులను రక్షించవలసిన అవసరమున్నది. లేనిచో మన బైఅత్ ప్రతిజ్ఞ కేవలం నామమాత్రమగును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా సంకల్పములు మీ సంకల్పములు అగునట్లు మీరు మారండి. అతని ప్రీతినే మీరు కోరండి. తమది ఏమియును వుండక సర్వము అతనిదే కావలెను. పవిత్రత అనగా హృదయపూర్వకముగా ఆచరణ, విశ్వాసపరంగా అల్లాహ్ తఆలా ఆశించిన విధంగా మారుట. ఒకని సంకల్పము నా సంకల్పము వలె, ఒకని ఇష్టము నా ఇష్టము ప్రకారము వున్నదని చూడనంత వరకు అల్లాహ్ తఆలా ఎవరికి సహకరించదు. అధిక సంఘముతో అతడెన్నడు సంతోషపడడు. బైఅత్‌ను సరియైన రీతిలో పాటించినప్పుడు అది స్వచ్ఛమైన సంఘమనబడును. నిజమైన రీతిలో వారిలో ఒక పవిత్ర మార్పు ఏర్పడవలెను. వారి జీవితము పాప మలినము నుండి పూర్తిగా శుభ్రము కావలెను. దైవ హక్కులు, ప్రజల హక్కులను మనస్ఫూర్తిగా, సంపూర్ణ పద్ధతిలో చెల్లించవలెను. ధర్మము కొరకు, ధర్మ ప్రచారము కొరకు వారిలో ఒక చింతన ఏర్పడవలెను. తమ కోరికలు, సంకల్పములు, ఆశలను అంతము చేసి దైవమునకు అంకితము కావలెను. మన జమాఅత్

వారిలో మరియు ఇతరులలో ఎలాంటి తేడా లేనప్పుడు అల్లాహ్ తఆలా ఎవరికి బంధువు కాదు. అల్లాహ్ తఆలా ఇట్లనెను. إِنَّمَا يَتَقَبَّلُ اللّٰهُ مِنَ الْمُتَّقِيْنَ అనగా అల్లాహ్ తఆలాతో భయపడి అతనికి ఇష్టము లేని విషయములను వీడు వారే నిష్ఠాపరులు. నిజమైన చింతన, దుఃఖకర స్థితి ఏర్పడనంత వరకు అది పూర్తిగా నిరుపయోగమైనది, అనవసరమైనదే అగును. ఆమోదము కొరకు దుఃఖమెంతో అవసరం. اَمَّنْ يُّجِيْبُ الْمُضْطَرَّ اِذَا دَعَاهُ وَيَكْشِفُ السُّوْٓءَ అనగా ఒక నిస్సహాయ వ్యక్తి దుఆను విన్నప్పుడు అల్లాహ్ తఆలా అతని బాధను దూరము చేయును.

మరల వారిట్లనిరి. భార్యా పిల్లల సంస్కరణ కూడ మీ బాధ్యతే. సత్కార్యములలో సదా ముందగుడు వేయువారికే అల్లాహ్ తఆలా సహాయ సహకారములు అందును. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా ఇట్లు దుఆ నేర్పెను. وَاَصْلِحْ لِيْ فِيْ ذُرِّيَّتِيْ అనగా నా భార్యాపిల్లలను సంస్కరించుము. తమ స్థితిగతులలో పవిత్ర మార్పులు చేసుకొంటూ దుఆలతో పాటు తమ సంతానము, భార్య కొరకు కూడ దుఆ చేయుచుండవలెను. ఎందుకనగా అధిక ఆపదలు సంతానము వలన లేదా భార్య వలన మానవునికి కలుగును. కనుక వారి సంస్కరణ కొరకు కూడ పూర్తి శ్రద్ధ చూపించవలెను. వారి కొరకు కూడ దుఆ చేస్తుండవలెను.

మన పరిస్థితులలో పవిత్ర మార్పులు కల్పించుకొనుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! తమ నమాజులను నిలుపుకొంటూ వాటిని ఉన్నత ప్రమాణాలకు చేర్చవలెను. తమ ధనమును కూడ పవిత్రము చేయవలెను. తమ ప్రవర్తనలను గొప్ప స్థాయికి చేర్చవలెను. సత్కర్మలు చేస్తూ వాటిని వ్యాపించవలెను. దుష్కార్యముల నుండి తాము స్వయముగా దూరముంటూ దుష్కార్యముల నుండి తమ సంతానమును కూడ దూరముంచవలెను. మస్‌జిదులను నిర్మించడంతో పాటు ఇస్లాం నిజమైన సందేశమును ఈ దేశ పౌరులకు అందించవలెను. వారు ఏకైక అల్లాహ్‌ను ఆరాధించేటట్లు చేయవలెను. మనము కూడ మనలో గొప్ప మార్పులు కల్పించుకొన్నప్పుడే ఇది సాధ్యమగును. అల్లాహ్ తఆలా ఇందుకు అనుగ్రహించుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ............................................. | ............................................. |
| ............................................. | ............................................. |
| ............................................. | ............................................. |
| ............................................. | ............................................. |